
సాక్షి
బాపట్ల
సోమవారం ౹ 20 ౹ నవంబర్ ౹ 2023



## రాహు-కేతు పూజలు

నకరికల్లు: నర్సింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి గుడిలో ఆదివారం రాహు-కేతు పూజలు నిర్వహించారు. దోష నివారణకు భక్తజనం తరలివచ్చారు.



## సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 2,423 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 870 క్యూసెక్కులు వదిలారు.



## గ్యార్మీ వేడుకలు

పొన్నూరు : పట్టణంలోని ప్రగతి ట్రాలీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. మహబూబ్ సుభాని జెండా ఊరేగింపు, అన్నదాన కార్యక్రమం జరిపారు.

# వైద్యయంత్రాంగం భేష్





జీజీహెచ్‌కు సమకూర్చిన ఆధునిక సీటీ సిమ్యులేటర్ యంత్రం, లీనియర్ యాక్సిలేటర్





ఆస్పత్రికి ప్రభుత్వం మంజూరు చేసిన సీఆర్మ్ పరికరాలు

### జీజీహెచ్ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ఆస్పత్రిలో 110 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- కోట్లాది రూపాయల వైద్య పరికరాలు మంజూరు
- సివిల్, ఎలక్ట్రికల్ పనుల కోసం ప్రత్యేక నిధులు
- భవన నిర్మాణాల కోసం రూ.కోట్లు విడుదల

**గుంటూరు మెడికల్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల పెద్దాసుపత్రిగా గుంటూరు జీజీహెచ్ పేరు గడించింది. గత ప్రభుత్వంలో టార్చ్‌లైట్ వెలుతురులో ఆపరేషన్లు.. ఎలుకల దాడిలో పసికందు మృతి లాంటి ఘటనలతో ఆస్పత్రి ప్రతిష్ట మసకబారింది. పేదలకు కార్పొరేట్ వైద్యసేవలను ఉచితంగా అందించటమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నారు. అందులో భాగంగా గుంటూరు జీజీహెచ్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో 110 పోస్టులు భర్తీ చేసేందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అనుమతులు మంజూరు చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే జీజీహెచ్‌లో కనీవినీ ఎరుగని రీతిలో 250 స్టాఫ్‌నర్సుల పోస్టులు మంజూరు చేశారు. నూతనంగా హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్, ఎమర్జెన్సీ మెడిసిన్, సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ వైద్య విభాగాలను మంజూరు చేశారు. యూరాలజీ, న్యూరాలజీలో అదనపు యూనిట్లను మంజూరు చేశారు. నూతనంగా 15 అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులనూ మంజూరు చేశారు. పారా మెడికల్ పోస్టులు భారీగా భర్తీచేశారు.

**రూ.కోట్లతో వైద్య పరికరాలు..**

ఆసుపత్రి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గుంటూరు జీజీహెచ్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రూ.కోట్లు ఖరీదు చేసే వైద్య పరికరాలు మంజూరు చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల కంటే దీటుగా అత్యాధునిక వైద్య పరికరాలతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు నిరుపేదలకు నేడు ఉచితంగా జీజీహెచ్‌లో లభిస్తున్నాయి. క్యాన్సర్ సెంటర్‌లో రెండు నెలల క్రితం రూ.25 కోట్లు ఖరీదు చేసే పెట్‌సిటీ పరికరాన్ని మంజూరు చేశారు. ఆసుపత్రికి రూ. 4 కోట్లు ఖరీదుచేసే సిటీస్కాన్ పరికరాన్ని ఇటీవల కాలంలో మంజూరు చేశారు. రూ.15 కోట్ల ఖరీదు చేసే లీనియర్ యాక్సిలేటర్, రూ. 40 లక్షలు ఖరీదు చేసే సీఆర్మ్ పరికరాలు, రూ. 25 లక్షలు ఖరీదు చేసే కొలనోస్కోపి, రూ.30 లక్షలు ఖరీదు చేసే ఏబీజీ మిషన్లు, రూ.25 లక్షలు ఖరీదు చేసే మైక్రోస్కోప్, రూ.30 లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్ లైట్లు, రూ.15 లక్షలు ఖరీదు చేసే మానిటర్స్, రూ.16 లక్షలు ఖరీదు చేసే ఓటీ కార్ట్స్, రూ.20 లక్షలు ఖరీదు చేసే ఎకోమిషన్, ఎస్ఐసీయూ, పీఐసీయూలో రూ.కోటి ఖరీదు చేసే వైద్య పరికరాలను మంజూరు చేశారు. కోవిడ్‌లో ఆసుపత్రి మొత్తం ఆక్సిజన్ సరఫరా జరిగేలా ప్లాంట్ల నిర్మాణం, ఆక్సిజన్ పైపుల నిర్మాణం చేయడంతోపాటు, 200లకుపైగా వెంటిలేటర్లను ప్రభుత్వం సరఫరా చేసింది.

### రూ. 80 కోట్లతో ఎంసీహెచ్ వార్డు

టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు రెండు సార్లు శిలాఫలకాలు వేసి ఒక్క ఇటుక కూడా కట్టకుండా పబ్లిసిటీ చేసుకున్న మదర్ అండ్ చైల్డ్ హెల్త్ వార్డు (మాతాశిశు సంరక్షణ కేంద్రం) నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రభుత్వం, జింఖానా సహకారంతో రూ. 80 కోట్లతో నిర్మితమవుతున్న ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఎంసీహెచ్ నిర్మాణం కోసం ప్రత్యేక చొరవ తీసుకుని జింఖానా ప్రతినిధులు, ముఖ్యమంత్రితో మాట్లాడటంతో భవన నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. ప్రస్తుతం మూడంతస్తులు నిర్మాణం పూర్తయింది. మరో మూడంతస్తులు పూర్తయితే మాతా, శిశు మరణాల తగ్గింపునకు ఈ కేంద్రం ఎంతో దోహదపడుతోంది. గత



నిర్మాణంలో ఉన్న ఎంసీహెచ్ వార్డు

ప్రభుత్వంలో నిర్మాణ పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేసిన సర్వీస్‌బ్లాక్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 7.5 కోట్లు మంజూరు చేసింది. కాకుమానువారితోటలో నూతన ఓపీ భవన నిర్మాణం కోసం మంజూరు చేసిన స్థలంలో ప్రహరీ నిర్మాణానికి రూ. 3.5కోట్లు మంజూరు చేసింది. ఆసుపత్రిలో సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మతుల కోసం రూ. 5 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

### జీజీహెచ్‌కు స్వర్ణయుగం..



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కాలం జీజీహెచ్‌కు స్వర్ణ యుగం లాంటిది. ఆసుపత్రి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నేడు అభివృద్ధి జరుగుతోంది. ఎప్పటినుంచో ఖాళీగా ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ అయ్యాయి. నూతనంగా పోస్టులను సైతం మంజూరు చేశారు. అత్యాధునిక వైద్య పరికరాలు ఇవ్వడంతో కార్పొరేట్ ఆసుపత్రులకంటే దీటుగా ఆపరేషన్లు చేస్తున్నాం. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా సహకారంతో ఆసుపత్రిలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్

### దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి ఆది దంపతులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. భక్తులు మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గంతో పాటు ఘాట్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరుకున్నారు. రద్దీ నేపథ్యంలో ఉదయం 9 గంటలకే కార్లు, ఇతర వాహనాలను కనకదుర్గనగర్ వైపు మళ్లించారు. మరో వైపున మహా మండపం లిఫ్ట్ మార్గం ద్వారా వచ్చే భక్తులను 5వ అంతస్తు వరకే అనుమతించారు. రూ.500, రూ.300, రూ.100 టికెటు క్యూలైన్‌తో పాటు సర్వ దర్శనం క్యూలైన్లలో భక్తుల రద్దీ కనిపించింది. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో చంద్రశేఖర్‌లు క్యూలైన్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలు అందచేశారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించగా పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

## న్యూస్‌రీల్

### బండ్లమ్మకు ప్రత్యేక పూజలు



**చందోలు(పిట్టలవానిపాలెం) :** చందోలులోని బగళాముఖి బండ్లమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అభయ ప్రదాయినిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

### విద్యార్థులకు బెన్‘ఫిట్’

**గుంటూరు ఎడ్యుకేషన్:** తరగతి గదిలో నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థుల్లో శారీరక దారుఢ్యాన్ని పెంచి, మానసిక ఉల్లాసాన్ని కల్పించేందుకు ప్రభుత్వం ‘‘ఫిట్ ఇండియా స్కూల్ వీక్’ పేరుతో సోమవారం నుంచి వారోత్సవాలను నిర్వహించనుంది. క్రీడలతో పాటు యోగా, ధ్యానం, నైపుణ్యం, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, మేథో వికాసం పెంచే ఉద్దేశంతో సోమవారం నుంచి ఈనెల 25 వరకు ఆరు రోజుల పాటు వినూత్న కార్యక్రమాల నిర్వహణకు విద్యాశాఖ సమగ్ర షెడ్యూల్ విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం.. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఫిట్ ఇండియా స్కూల్ వారోత్సవాలను నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆదేశించారు. వారోత్సవాల నిర్వహణను పర్యవేక్షించాలని డీవైఈఓలు, ఎంఈఓలకు ఆదేశాలిచ్చారు.

### విజయకీలాద్రిపై శ్రవణా నక్షత్ర వేడుకలు



**తాడేపల్లిరూరల్ :** సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఆదివారం శ్రవణా నక్షత్ర వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చినజీయర్‌స్వామి మంగళా శాసనాలతో శ్రవణా నక్షత్రం సందర్భంగా వేంకటేశ్వరస్వామికి ఉదయం 9 గంటల నుంచి పంచామృతాలతో తిరుమంజనం నిర్వహించామని, 10 గంటలకు విజయాద్రి శ్రీనివాసునికి నిత్య కల్యాణ ఉత్సవం నిర్వహించామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని వెల్లడించారు.

### బూందీ రూపంలో వెండి సమర్పణ



**మోపిదేవి(అవనిగడ్డ):** స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి విజయవాడకు చెందిన భక్తులు కేశనం జగదీశ్వరావు దంపతులు కిలో వెండితో తయారు చేసిన బూందీ ఆకారంలో వస్తువు సమర్పించుకున్నారు. ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న వీరు సుమారు రూ.76 వేలు విలువైన కిలో వెండి ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందించారు. దాతను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

### 22న జూడో క్రీడాకారుల ఎంపిక

**హనుమాన్‌జంక్షన్ రూరల్:** జూడో క్రీడాకారుల సెలక్షన్స్ ఈ నెల 22వ తేదీన హనుమాన్‌జంక్షన్‌లో నిర్వహిస్తున్నామని ఉమ్మడి కృష్ణా జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షుడు వజ్రె అంజిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయి గీతాంజలి హైస్కూల్ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి జూడో క్రీడాకారుల ఎంపిక ఉంటుందని చెప్పారు. సబ్ జూనియర్ విభాగంలో జిల్లా జట్టు ఎంపిక నిమిత్తం నిర్వహించే ఈ సెలక్షన్స్‌కు 2009 నుంచి 2011 మధ్య జన్మించిన బాల బాలికలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జూడో కోచ్‌లు, క్రీడాకారులు 9948656781 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# ‘దారి’తప్పిన ట్రాఫిక్

- గుంటూరు నగరంలో నిబంధనలకు నీళ్లు
- పట్టించుకోని ట్రాఫిక్, ఆర్టీఓ అధికారులు
- మామూళ్ల మత్తులో మునిగినట్టు ఆరోపణలు





విద్యార్థి వాసు మృతికి కారణమైన ట్రాక్టర్, (ఇన్‌సెట్) చనిపోయిన విద్యార్థి వాసు



**పట్నంబజారు(గుంటూరు ఈస్ట్):** గుంటూరు నగరంలో ట్రాఫిక్ వ్యవస్థ దారితప్పింది. ట్రాక్టర్లు, లారీల డ్రైవర్లు నిబంధనలకు నీళ్లొదిలి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నా.. ట్రాఫిక్ పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టడం లేదు. మామూళ్ల మత్తులో జోగుతుండడం వల్లే మిన్నకుండిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఇవిగో నిదర్శనాలు**

- రెండు రోజుల క్రితం నల్లచెరువు నుంచి రామనామక్షేత్రం వైపు వెళ్తున్న ఒక ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఏడో తరగతి విద్యార్థి దొర వాసు (14) ట్రాక్టర్ చక్రాల కింద పడి విగితజీవిలా మారాడు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటలకు నగరంలోకి ట్రాక్టర్లకు అనుమతి లేకపోయినా ఈ ట్రాక్టర్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో యథేచ్ఛగా నగరంలో హల్‌చల్ చేసింది. ట్రాఫిక్ పోలీసులు ఏమాత్రం పట్టించుకోకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. పైగా ట్రాక్టర్ డ్రైవర్‌కు లైసెన్స్ లేకపోవటంతో పరారయ్యాడు. ఈలోగా ఈ ప్రమాదానికి తానే కారణమని మరో వ్యక్తి స్టేషన్‌లో లొంగిపోవడం గమనార్హం. ట్రాక్టర్‌తో ఎటువంటి సంబంధం లేని మరో వ్యక్తి ట్రాక్టర్ తాను కొనుగోలు చేశానంటూ.. స్టేషన్‌కు వచ్చి లొంగిపోవడం, ప్రమాదం జరిగి రోజులు గడుస్తున్నా.. సదరు యజమాని, డ్రైవర్‌ను పట్టుకోవటంలో పోలీసులు పూర్తిస్థాయిలో విఫలం కావడం అనేక అనుమానాలకు తావిస్తోంది.
- కొద్ది కాలం క్రితం అమరావతిరోడ్డులో ఒక యువకుడు మధ్యాహ్నం సమయంలోనే ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌కు ఫిటెనెస్ సర్టిఫికెట్ (బ్రేక్), ఇన్సూరెన్స్ కూడా లేకపోవటంతో మృతి చెందిన యువకుడి కుటుంబానికి ఎటువంటి నష్టపరిహారం అందలేదని తెలుస్తోంది. ఈ కేసులోనే రూ.25 వేలు తీసుకున్న ఒక స్టేషన్ అధికారి, ఆ ట్రాక్టర్‌ను స్టేషన్ బెయిల్‌పై విడిచిపెట్టారనే విమర్శలు ఉన్నాయి.
- నాలుగు రోజుల క్రితం కాకానిరోడ్డులో ఇటుక లోడ్‌తో నగరంలోకి వస్తున్న ట్రాక్టర్ ఒక కారును ఢీకొట్టింది. అయితే ఇరువర్గాలు అక్కడికక్కడే రాజీ పడ్డాయి. గతంలో కొరిటెపాడు సెంటర్‌లో ట్రాక్టర్ కార్‌ను ఢీకొట్టింది. కారులో ఉన్న వృద్ధ దంపతులు బతుకు జీవుడా అంటూ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. రెండు ఘటనల్లో డ్రైవర్లు ఫూటుగా మద్యం సేవించి ఉండటం గమనార్హం.

**ట్రాక్టర్‌కు రూ.1500, లారీకి రూ.2,000**

ట్రాఫిక్, ఆర్టీఓ అధికారులు మామూళ్లకు అలవాటు పడడం వల్లే నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్లు, లారీలు నగరంలోకి ప్రవేశిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలో మొత్తం 114 ట్రాక్టర్‌లు, 95 లారీలు తిరుగుతున్నట్టు అంచనా. వీటికి సంబంధించి ట్రాఫిక్ ఉన్నతాధికారులతోపాటు ఈస్ట్, వెస్ట్ సబ్‌డివిజన్ అధికారులకు మామూళ్ళు అందుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ట్రాక్టర్‌కు రూ. 1,500, లారీకి రూ.2,000 చొప్పున నెలవారీ తీసుకుంటున్నారని సమాచారం. దీంతోపాటు న్యూ గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి వారానికి నాలుగు రోజుల చొప్పున రైతులకు సంబంధించిన వస్తువుల పేరుతో కొన్ని లారీలు పలు రకాల సామగ్రిని యథేచ్ఛగా తరలించేస్తున్నాయని తెలుస్తోంది.

**నిబంధనలు విస్మరిస్తే కఠిన చర్యలు**



నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశిస్తే.. ఉపేక్షించం. కచ్చితంగా జరిమానాలు విధించటంతో పాటు చర్యలు తీసుకుంటాం. ట్రాక్టర్‌లు, లారీలు వస్తున్నట్లు అందిన ఫిర్యాదుల మేరకు నగరంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టేలా అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. అవినీతికి పాల్పడితే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తాం.

– కె.సుప్రజ (ఏఎస్పీ, అడ్మిన్)

వీటిలో సుమారు 25 లారీలకు సంబంధించి ట్రిప్‌కు రూ.4వేలు చొప్పున అందుతున్నాయని ట్రాఫిక్ విభాగం సిబ్బందే చెవులు కొరుక్కోవడం గమనార్హం.

**పంపకాల్లో పేచీలు**

నిబంధనలు ఏమాత్రం పట్టని ట్రాఫిక్ పోలీస్ అధికారులు పంపకాల్లో మాత్రం పేచీలు పెట్టుకుంటున్నారు.

- ఇటీవల బదిలీపై వెళ్లిన ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఒకరు ట్రాక్టర్లు, లారీలు, ట్రాన్స్‌పోర్టులు, ప్రైవేట్ బస్సుల యాజమాన్యాల నుంచి అడ్వాన్స్‌గా కొద్దినెలల మొత్తాన్ని వసూలు చేసుకుని వెళ్లిపోయారని, దీంతో ట్రాఫిక్ ఉన్నతాధికారి సీఐ వెళ్ళిపోతున్న క్రమంలో తన కార్యకలాపాలు చూసుకునే ఉద్యోగిని రాయబారిగా పంపి మరీ పంపకాల విషయంలో పంచాయితీ పెట్టారని తెలుస్తోంది. ఈ అధికారి ఏమాత్రం భేషజం లేకుండా నెలవారీ మామూళ్ల పంపకాల గురించి నేరుగా స్టేషన్ల అధికారులను అడుగుతున్నారని సమాచారం.
- ఈ మధ్య కాలంలో ఒక ట్రాఫిక్ ఎస్ఐ టర్న్ డ్యూటీ నిమిత్తం 15 రోజులు తాడేపల్లికి వెళ్లాడు. తిరిగి వచ్చిన తర్వాత అతను లేని సమయంలో తన బీట్ చూసిన మరో ఎస్ఐతో మామూళ్ల విషయమై బహిరంగంగానే వాగ్వివాదానికి దిగినట్టు సమాచారం.

**అవినీతి సిబ్బందికి మినహాయింపు**

ఇటీవల కాలంలో ట్రాఫిక్ ఈస్ట్, వెస్ట్ సిబ్బందిని అటు నుంచి ఇటు మారుస్తూ అధికారులు పలు నిర్ణయాలు తీసుకున్నారు. రెండేళ్లు దాటిన ఎస్ఐ స్థాయి అధికారి నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు మార్పులు, చేర్పులు చేశారు. అయితే సుమారు నాలుగైదేళ్ల తరబడి స్టేషన్లలో మామూళ్ల విషయం చక్రం తిప్పుతున్న సిబ్బందికి మాత్రం మినహాయింపు ఇచ్చారని ట్రాఫిక్ విభాగ సిబ్బందే చర్చించుకుంటున్నారు.

# జన జీవితాలకు సీఎం జగన్ భరోసా



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న వారితో మంత్రి విడదల రజిని

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 27 మందికి రూ. 27.88 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**చిలకలూరిపేట:** ప్రజల జీవితాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా భరోసా కల్పిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. యడ్లపాడుకు చెందిన కారుచోల శ్రీనివాస్‌కు రూ.5 లక్షలు, గణపవరానికి చెందిన నాగిశెట్టి శ్రీనివాసరావుకు రూ.1.20 లక్షలు, పట్టణానికి చెందిన దాసరి ప్రసాద్‌కు రూ.1.50 లక్షలు, కొండవీడుకు చెందిన షేక్ షెహనాజ్‌కు రూ.2.10 లక్షలు, సొలసకు చెందిన బాపతు బాలకృష్ణారెడ్డికి రూ.1.10 లక్షలు ఇలా నియోజకవర్గంలోని మొత్తం 27 మందికి రూ.27.88 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని వెల్లడించారు. ఒకవైపు ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు అందజేస్తూనే మరోవైపు వివిధ కారణాలతో ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందిన వారిని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. ఇంత మానవత్వం ఉన్న ముఖ్యమంత్రి దేశంలో మరెక్కడా లేరని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

# టెన్త్ విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి

- ఉచితంగా స్టడీ మెటీరియల్
- జెడ్పీ పాలకవర్గం వరం
- వరుసగా రెండో ఏడాదీ పంపిణీకి చర్యలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 39వేల మందికి ప్రయోజనం

**గుంటూరు ఎడ్యుకేషన్:** ‘‘జగనన్న విద్యాజ్యోతి’’ పేరుతో టెన్త్ విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీకి జిల్లా పరిషత్ పాలకవర్గం వరుసగా రెండో ఏడాదీ చర్యలు చేపడుతోంది. గతేడాది రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ వినూత్న కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, మోడల్, సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ పాఠశాలలతోపాటు కేజీబీవీ, ఎయిడెడ్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ వరంగా మారనుంది. ఎంపిక చేసిన సబ్జెక్టు నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యాశాఖాధికారుల నుంచి అందుకున్న జెడ్పీ పాలకవర్గం పుస్తకాల ముద్రణకు ఏర్పాట్లు చేస్తోంది. ఈనెలాఖరులో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనుంది. దీంతో పాటు గతేడాదిలాగానే ఈ ఏడాదీ జెడ్పీ నిధులతో టెన్త్ విద్యార్థులకు స్టడీ అవర్లలో అల్పాహారం పంపిణీ చేయాలని క్రిస్టినా నిర్ణయించారు.

**రూ.70 లక్షల వ్యయం**

గతేడాది రూ.61.80 లక్షల వ్యయంతో 36,155 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 39వేల మంది విద్యార్థులు చదువుతున్నట్లు గుర్తించారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని రూ.70 లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేశారు. పూర్తిగా జెడ్పీ నిధులతో తెలుగు, ఇంగ్లిషు మీడియంల వారీగా మెటీరియల్ ముద్రణ చేపడుతున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా సూచన మేరకు గుంటూరు డీఈఓ పి.శైలజ సబ్జెక్టు నిపుణులతో మెటీరియల్ రూపొందించారు.




జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ (ఫైల్)

**సీఎం జగన్ నుంచి ప్రశంసలు**

చదువుల విప్లవాన్ని తెచ్చిన సీఎం వైఎస్ జగన్ బాటలోనే గత ఏడాది చేపట్టిన జగనన్న విద్యాజ్యోతి కార్యక్రమం అద్భుత ఫలితాలనిచ్చింది. ఉచిత మెటీరియల్ పంపిణీతో టెన్త్ విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెరిగింది. ఫలితంగా సీఎం వైఎస్ జగన్ నుంచి ప్రశంసలు అందుకున్నాం. పొరుగు జిల్లాలకు ఆదర్శంగా నిలిచాం. ప్రస్తుతం రెండో దఫా స్టడీ మెటీరియల్ ముద్రణకు చర్యలు చేపడుతున్నాం. ఫిబ్రవరిలో అల్పాహారం అందజేతకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

– కత్తెర హెనీ క్రిస్టీనా, జెడ్పీ చైర్‌పర్సన్

# హోరాహోరీగా జాతీయ స్థాయి క్రీడా పోటీలు

**గుడ్లవల్లేరు:** శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ రజతోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఈ పోటీలకు 2,500 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. పురుషులు, మహిళల విభాగాల్లో తలపడ్డారు. పురుషుల విభాగంలో బాస్కెట్ బాల్ – 11, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ – 27, ఖోఖో – 8, కబడ్డీ – 33, రోప్ స్కిప్పింగ్ – 7, టేబుల్ టెన్నిస్ డబుల్స్ – 3 టీములు, అథ్లెటిక్స్‌లో పురుషుల వ్యక్తిగత విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో 22 మంది, 400 మీటర్ల పరుగు పందెంలో 27 మంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గుంటూరు డివిజన్ మీదుగా శబరిమలకు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే శబరిమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. సికింద్రాబాద్–కొల్లం (07219) ప్రత్యేక రైలును ఈనెల 26, డిసెంబర్ 3వ తేదీన గుంటూరు డివిజన్ మీదుగా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ రైలు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.55 గంటలకు కొల్లం చేరుకుంటుందని తెలిపారు. అదేవిధంగా కొల్లం–సికింద్రాబాద్(07130) రైలు ఈనెల 28, డిసెంబర్ 5వ తేదీల్లో డివిజన్ మీదుగా నడుస్తుందని తెలిపారు. ఈ రైలు కొల్లం స్టేషన్ నుంచి అర్ధరాత్రి 2.30 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 8.55 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. కాచిగూడ–కొల్లం(07123) రైలు ఈనెల 22, 29 తేదీల్లో, డిసెంబర్ 6వ తేదీన గుంటూరు డివిజన్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. కొల్లం–కాచిగూడ(07214) రైలు ఈనెల 24, డిసెంబర్ 1, 8వ తేదీలలో డివిజన్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

### ట్రేడ్ మార్క్‌పై అవగాహన అవసరం



పాత గుంటూరు: పరిశ్రమలు, వివిధ ఉత్పత్తులను తయారు చేసే వ్యాపారులు ట్రేడ్ మార్క్‌పై అవగాహన కలిగి వుండాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. ఆదివారం జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో వోక్స్ ఫాంటమ్ ఐపీ సొల్యూషన్స్ కొలాబరేషన్, చాంబర్ సంయుక్త ఆధ్వర్యంలో మేధో సంపత్తి హక్కుల రక్షణపై వ్యాపారులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆంజనేయులు అధ్యక్షత వహించి మాట్లాడారు. వ్యాపారులు ట్రేడ్ మార్క్ కలిగి ఉంటే తమ వ్యాపారానికి సంబంధించిన బ్రాండ్‌ను వేరొకరు వినియోగించే అవకాశం ఉండదని పేర్కొన్నారు. ఐపీఆర్ నిర్వాహకులు మామిళ్లపల్లి సుధీర్ మాట్లాడుతూ నూతనంగా పరిశ్రమలు ఏర్పాటు చేసేవారు, వివిధ ఉత్పత్తులు తయారుచేసే వారు ట్రేడ్ మార్క్ తీసుకుంటే భద్రతతో పాటు వ్యాపారాభివృద్ధికి ఉపయోగపడుతుందని అన్నారు. మామిళ్లపల్లి రవికుమార్, వ్యాపారులు పాల్గొన్నారు.

# ఆ బాధ ఇంతింత కాదయా.!

- ఆధునిక జీవన విధానంతో పైల్స్
- వ్యాధి బారిన పడుతున్న యువత
- జీజీహెచ్‌లో ఆధునిక చికిత్స
- నేడు వరల్డ్ పైల్స్ డే




గుంటూరు మెడికల్: మొలలు లేదా పైల్స్ అనేవి సాధారణంగా 50 ఏళ్ల వయస్సువారిలో వస్తుంటాయి. ఆధునిక జీవనశైలి వల్ల నేడు యువత 30 ఏళ్లకే వీటి బారిన పడుతున్నారు. కాలేజ్ విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నట్లు వైద్య నిపుణులు తెలిపారు. మొలలు అనేవి మగవారిలో, ఆడవారిలో సాధారణంగా వస్తాయి. మొలలు ఉన్నవారికి తరచుగా ఇబ్బంది కలుగుతూ ఉంటుంది. మాటల్లో వారు తమ బాధను చెప్పుకోలేరు. పైల్స్ ఉన్నవారు ఎక్కువసేపు కూర్చున్నా, తిరుగుతున్నా చాలా ఇబ్బందిగా ఉంటుంది. హెమోరాయిడ్స్‌గా పిలిచే మొలలపై అవగాహన కల్పించేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది నవంబర్ 20న వరల్డ్ పైల్స్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

**కారణాలు...**

మల విసర్జన కష్టంగా ఉండి మామూలుగా కాకుండా తక్కువగా మలవిసర్జన జరుగుతుంటే దానిని మలబద్ధకం అంటారు. ఇలాంటి సమయాల్లో ఎక్కువ ముక్కినప్పుడు అన్నవాహిక చివరి భాగంలో, మలద్వారానికి పైన పురీషనాళం చివరన వాచిపోయిన రక్తనాళాలను మొలలు అంటారు. మొలలు మలద్వారం నుంచి బయటకు పొడుచుకొచ్చి గానీ అంతర్లీనంగా పురీష నాళంలోనే పెరిగే అవకాశం ఉంది. మొలలు ఏర్పడటానికి ప్రధాన కారణం మలబద్ధకం. కొందరిలో మలద్వారం దగ్గర ఉండే సిరలు బలహీనంగా ఉండటం వల్ల మొలలు వస్తాయి. వంశపారం పర్యంగా మొలలు వచ్చే అవకాశం ఉంది. వ్యాయామం చేయకపోవటం, అధిక బరువు ఉండటం వల్ల, గర్భం దాల్చినప్పుడు, ఆహారపు అలవాట్లు, పీచు పదార్థాలు తక్కువగా ఉండే ఆహారం తినటం ద్వారా పైల్స్ వచ్చే అవకాశం ఉంది. ఒకేచోట ఎక్కువ సేపు కూర్చొని పనిచేయడం, మానసిక ఒత్తిడి, మద్యపానం, నీరు తక్కువగా తాగడం, మాంసాహారం, జంక్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం చేసే వారిలో పైల్స్ వస్తాయి.

**లక్షణాలు...**

మలద్వారం చుట్టూ దురదగా ఉంటుంది. మలవిసర్జన సమయంలో మల విసర్జన ద్వారం వద్ద నొప్పి ఉంటుంది. మలద్వారం వాచి ఉండటం లేదా ఉబ్బుగా ఉంటుంది. మల విసర్జన సమయంలో లేదా అనంతరం రక్తస్రావం జరుగుతుంది.

**నివారణ చర్యలు...**

పీచు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. ద్రవపదార్థాలను ప్రత్యేకంగా నీళ్లను ఎక్కువగా తాగాలి. పండ్లు, ఆకు కూరలు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి. ఎక్కువగా శ్రమపడి ఒత్తిడి కలిగేలా మల విసర్జన చేయకూడదు. కారం, మసాలాలు, పచ్చళ్లు, వేపుళ్లు, దుంప కూరలకు దూరంగా ఉండాలి.

**ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి**



పైల్స్ రాకుండా వ్యాధిపై అవగాహన కలిగి ఉండి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు. పైల్స్ బాధితులకు గుంటూరు జీజీహెచ్‌లో అత్యాధునిక వైద్య సేవలు ఉచితంగా అందించి, ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తున్నారు. నూటికి 90 శాతం మందులతో తగ్గుతాయి. కేవలం పది శాతం మందికి మాత్రమే ఆపరేషన్లు చేయాల్సి వస్తుంది. ఆపరేషన్‌లలో అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఇంట్రనల్ పైల్స్‌ను ఎండోస్కోపీ ద్వారా క్లోజ్ చేస్తున్నారు. లేజర్ చికిత్స ద్వారా అతి తక్కువ కోత, కుట్లతో ఆపరేషన్లు చేస్తున్నారు. – డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, గుంటూరు జీజీహెచ్

**బాధితులు...**

గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ వైద్య విభాగానికి ప్రతిరోజూ పది మంది పైల్స్ సమస్యతో చికిత్స కోసం వస్తున్నారు. జిల్లాలో 120 మంది జనరల్ సర్జన్లు, పది మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతిరోజూ ఇద్దరి వరకు మొలల బాధితులు చికిత్స కోసం సంప్రదిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి.

**చికిత్సలు...**

స్టాప్లర్, లేజర్, హాల్స్ వంటి ఆధునిక చికిత్సా విధానాల ద్వారా ఎక్కువ నొప్పి, గాయం లేకుండా చేసే శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయి.

# రహదారి భద్రత.. సామాజిక బాధ్యత



వాకథాన్ నిర్వహిస్తున్న ఆర్టీఓ, ట్రాఫిక్, ఆర్టీసీ అధికారులు, విద్యార్థులు

నగరంపాలెం: దేశవ్యాప్తంగా ఏడాదికి ఐదు లక్షలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అందులో 1.60 లక్షల మంది మృత్యువాతకు గురవుతున్నారని, మరో ఐదు లక్షల మంది గాయపడుతున్నారని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం అన్నారు. రహదారి ప్రమాదాల బాధితుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రవాణా, పోలీస్ శాఖ సంయుక్తంగా ఆదివారం పోలీస్‌పరేడ్ గ్రౌండ్ నుంచి నగరం పాలెం మూడు బొమ్మల సెంటర్ వరకు విద్యార్థులు, ఆటో/ బస్ డ్రైవర్లతో వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 900 రహదారి ప్రమాదాల జరిగాయని, అందులో 320 మంది మృత్యువాతపడగా, 1200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని అన్నారు. ప్రతి వాహన చోదకుడు రహదారి భద్రత సామాజిక బాధ్యతగా చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారనే ఆలోచనతో వాహనాలను జాగ్రత్తగా నడపాలని అన్నారు. ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు మాట్లాడుతూ విచక్షణరహితంగా వాహనాలు నడపవద్దని, అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉందన్నారు. ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణతైన విద్యార్థులు వాహనాలు నడుపుతూ ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే, వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. తద్వారా రూ.5 వేలు జరిమానా, కోర్టు శిక్షలు కూడా అమలు చేస్తారని పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ అధికారి సమర్పణరావు, ఎస్సీ పంచాయతీరాజ్ అధికారి జి.బ్రహ్మం, వాహన తనిఖీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### టీటీడీ అన్నదానానికి కూరగాయలు పంపిణీ



మార్టూరు: టీటీడీ నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం మార్టూరు నుంచి దాతల సాయంతో తిరుమలకు కూరగాయలు పంపించారు. విజయవాడ కూరగాయల మార్కెట్ నుంచి ప్రత్యేకంగా అలంకరించిన కూరగాయల లారీ స్థానిక స్టేట్ బ్యాంక్ సెంటర్‌లోకి రాగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఇదే క్రమంలో స్థానిక గ్రానైట్ వ్యాపారులు శ్రీశైలం నిత్యాన్నదానానికి అవసరమైన నిత్యావసర సరుకులను లారీకి నింపగా రెండు లారీలను రెండు ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా భక్తులకు టీటీడీ లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

## ఫైనల్‌కు చేరిన కడప, విజయనగరం బాలుర జట్లు



పోటీలో తలపడుతున్న కర్నూలు, విజయనగరం బాలికల జట్లు

- నేటితో ముగియనున్న అండర్–14 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు
- బాలికల విభాగంలో ఫైనల్‌కు చేరిన కర్నూలు, విజయనగరం జట్లు

పెదకాకాని: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో రాష్ట్రస్థాయి అండర్– 14 సాఫ్ట్‌బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆదివారానికి రెండో రోజుకు చేరిన పోటీల్లో బాలబాలికల విభాగాల్లో 13 జిల్లాల నుంచి 476 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. శని, ఆదివారాల్లో లీగ్ పద్ధతిలో నిర్వహించిన పోటీల్లో ఫైనల్‌కు కడప, విజయనగరం బాలుర జట్లు, బాలికల విభాగంలో కర్నూలు, విజయనగరం జట్లు చేరాయి. చివరి రోజు సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే పోటీల అనంతరం విజేతల్ని ప్రకటిస్తామని, సాయంత్రం విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పేరం మస్తాన్ రెడ్డి తెలియజేశారు.



క్యాంప్ ఫైర్‌లో విద్యార్థుల సందడి

**ఉత్సాహంగా క్యాంప్ ఫైర్**

పోటీల్ని పురస్కరించుకుని రాత్రి నిర్వహించిన క్యాంప్ ఫైర్‌లో ఆయా జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్సాహంగా, ఉల్లాసంగా స్టెప్‌లు వేస్తూ ఆనందంగా సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నంబూరు తిరుపతిరావు, టోర్నమెంట్ జిల్లా కార్యదర్శి జగదీశ్వరరెడ్డి, టోర్నమెంట్ పరిశీలకులు చంటిబాబు, వరప్రసాద్, నందకుమార్, ప్రశాంత్‌బాబు, ఎండీ. బేగం, సునీత, శివశంకర్, హృదయరాజు పాల్గొన్నారు. క్రీడాకారులకు వసతి, భోజనం సౌకర్యాల్ని ఉపాధ్యాయులు ఎస్. వెంకటరెడ్డి, జోసెఫ్, సుధాకరరెడ్డి, పర్యవేక్షించారు.

## రేడియాలజిస్టుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ కిశోర్‌కుమార్



గుంటూరు మెడికల్: జీజీహెచ్ రిటైర్డ్ రేడియాలజిస్ట్, గుంటూరుకు చెందిన సీనియర్ రేడియాలజిస్ట్ డాక్టర్ చిటితోటి కిశోర్‌కుమార్ ఆంధ్రప్రదేశ్ రేడియోలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంటూరుకు చెందిన డాక్టర్ సునీత జాయింట్ సెక్రటరీగా, డాక్టర్ సుజాత కోశాధికారిగా, డాక్టర్ జాహ్నవి సైంటిఫిక్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన గుంటూరుకు చెందిన రేడియాలజిస్టులకు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ చిట్టిబాబు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ జి.వి. పార్వతీశ్వరరావు అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 25 నుంచి 28 వరకు తమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు గుంటూరు జిల్లా మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు డాక్టర్ కిశోర్ కుమార్ తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సంఘ నేతలు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ వైద్యులకు, పీజీలకు నిరంతర వైద్య విద్య కార్యక్రమాలు(సీఎంఈలు) నిర్వహించి వారిలో వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. అసోసియేషన్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# కొయ్యగుర్రం ఒక దుఃఖ కావ్యం

పుస్తకావిష్కరణ సభలో ప్రముఖ కవి నగ్నముని



కొయ్యగుర్రం పుస్తకాన్ని ఆవిష్కరణలో రచయిత నగ్నముని, ఇతర ప్రముఖులు

తెనాలి: నాలుగున్నర దశాబ్దాల క్రితం దివిసీమ ఉప్పెన మిగిల్చిన విషాదాన్ని, ప్రకృతి విలయ తాండవానికి ప్రజల్ని వదిలేసిన శోకాన్ని దృష్టిలో ఉంచుకుని రచించిన దుఃఖకావ్యం కొయ్యగుర్రం అని కావ్య రచయిత నగ్నముని అన్నారు. నాలుగు దశాబ్దాల క్రితం రచించిన కొయ్యగుర్రం కావ్యం నాలుగో ముద్రణ పుస్తకాన్ని ఆదివారం రాత్రి తెనాలిలో ఆవిష్కరించారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. పుస్తక రచయిత, తెనాలికి చెందిన ప్రముఖ కవి నగ్నముని మాట్లాడుతూ చట్టాలంటే తెలియని రాజకీయ నాయకులను చట్టసభలకు పంపుతుంటే కలుగుతున్న అనర్థాలకు కొయ్యగుర్రం ఒక నిదర్శనమన్నారు. పాత్రికేయుడు అంబటి సురేంద్రరాజు మాట్లాడుతూ కొయ్యగుర్రం కావ్యాన్ని శ్రవణ మాధ్యమంలో తీసుకురావాల్సిన ఆవశ్యకతను చెప్పారు. ఎన్ఆర్ తపస్వి స్వాగతం పలికారు. న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు మాట్లాడారు. డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యం, అరవింద విద్యాకేంద్రం సంపూర్ణ, విశ్రాంత అధ్యాపకురాలు ఎ.రాజేశ్వరి, ఎన్ఆర్ఐ తిరుమలశెట్టి నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు.

## వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. తొలుత స్వామి వారి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకురాగా, ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా మాంగల్యధారణ జరిగింది. ఉత్సవంలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. అనంతరం నిర్వహించిన పల్లకీ సేవలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## సుబ్బారాయుడు ఆలయం కిటకిట



సుబ్బారాయుడి ఆలయం నాగపుట్టలో పాలుపోస్తున్న భక్తులు

మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. కార్తికమాసం, ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూలైన్ భక్తులతో కిట కిటలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## కనుల పండువగా కార్తిక దీపోత్సవం



శివలింగం రంగవల్లి చుట్టూ కార్తిక దీపాలు



దీపకాంతులతో వెలుగొందుతున్న ఆలయ ప్రాంగణం

కోడూరు: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కోడూరు గంగాభవానీ అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి కార్తిక దీపోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శివలింగాకృతి, నందీశ్వరుడి రంగవల్లులను తీర్చిదిద్ది వాటి చుట్టూ కార్తిక దీపాలను వెలిగించారు. వీటితో పాటు ఆలయం చుట్టూ స్వస్తిక్, ఓంకారం ఆకారాల్లో మహిళలు దీపాలు వెలిగించారు. స్థానిక వ్యాపారి కోడూరు వెంకటేశ్వరరావు దంపతులు దీపోత్సవానికి కర్తలుగా వ్యవహరించారు. ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా, ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం



స్వామి వారి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. బ్రాహ్మణవీధిలో దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి వారికి ఆదివారం శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కార్తికమాసంలో వచ్చే శ్రవణా నక్షత్రం కావటంతో అత్యంత పవిత్రమైనదిగా భావించి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో తీసుకొచ్చి కల్యాణవేదికపై ఉంచారు. అనంతరం ఆలయ అర్చకస్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞోపవీతధారణ, జీలకర్ర బెల్లం ధారణ, మాంగల్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**వైభవంగా తిరుమంజనం**

స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

# ఆది దంపతుల ఆర్జిత సేవలకు డిమాండ్



సహస్ర లింగార్చన జరిపిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం, ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రిపై ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవలకు డిమాండ్ అధికంగా ఉంది. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉత్సవ మూర్తి వద్ద నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణంతో పాటు చండీహోమాల్లో ఉభయదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇక మల్లేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, త్రికాల అభిషేకాలతో పాటు సహస్ర లింగార్చన, సాయంత్రం ఊంజల్ సేవ, దీపార్చన, పల్లకీ సేవల్లో కూడా భక్తులు భారీగా పాల్గొన్నారు.

**సూర్యోపాసన సేవ**

అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.